# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 06 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4





పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు

**శ్రీరామనవమి పండుగ శుభాకాంక్షలు**

పండుగ సందర్భంగా ఆదివారం పత్రికకు సెలవు

సోమవారం సంచిక వెలువడదు. పునఃదర్శనం సోమవారం

- బలగం టీవి సీఈఓ బాలు కాయితీ


## హెచ్‌సీయూ భూములను

# లాక్కున్నట్టు వివాదం సృష్టించారు

- ఏఐతో చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్‌ను మించిన మహమ్మారిలాంటివి
- ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలి
- వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు జాతీయ స్థాయిలో వైరలయ్యాయి
- ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరింది
- ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తుల్లో యుద్ధాలు జరిగే పెను ప్రమాదం
- సైబర్ క్రైం విభాగాన్ని మరింత బలోపేతం చేయాలి
- కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియా నెట్‌వర్క్ ద్వారా కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు ధనసరి అనసూయ సీతక్క , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి డీజీపీ జితేందర్ , పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియల్ , టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి , అటవీ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు , ఫొటోలు కరోనా వైరస్‌ను మించిన మహమ్మారి లాంటివని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. కంచె గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25 లో ఉన్న భూముల్లో గత 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు బిల్డింగ్‌లు, రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ భవనాలను నిర్మించారు. వాటిని నిర్మించే సందర్భాల్లో ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు. అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని అంశంపై సమావేశంలో చర్చ జరిగింది.

అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు వివరించారు. వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సమావేశంలో వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు. ఏకంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , మాజీ మంత్రి జగదీష్ రెడ్డి , సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీ గారు, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టండన్ లాంటి వారందరూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోల పోస్టు చేసి సమా జానికి తప్పుడు సందేశం చేరవేశారన్న చర్చ సమావేశంలో జరిగింది. ఈ భూములపై మొట్టమొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ ఝా కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలిగించి క్షమాపణలు చెప్పారని, కానీ మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారని అధికారులు వివరించారు.

కంచె గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ఇదే తరహాలో ఇండో పాక్, ఇండో చైనా సరిహద్దుల్లాంటి వివాదాలు, ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తుల్లో యుద్ధాలు జరిగే పెను ప్రమాదముంటుందని చర్చ జరిగింది. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ఏఐ ఫేక్ కంటెంట్‌ను గుర్తించడానికి అవసరమైన అధునాతన ఫోరెన్సిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు.



## ప్రభుత్వం ఇష్టానుసారంగా

# వ్యవహరిస్తే వ్యతిరేకత తప్పదు

- కోర్టులు, పౌర సమాజం, విద్యార్థుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కోవాలి
- ప్రస్తుత హెచ్‌సీయూ వివాదం ఒక ఉదాహరణ
- మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వం తమ ఇష్టానుసారం వ్యవహరిస్తే, కోర్టులు, పౌర సమాజం, విద్యార్థుల నుండి వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. దానికి ప్రస్తుత హెచ్‌సీయూ వివాదం ఒక ఉదాహరణ అని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ, రజతోత్సవ మహాసభ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల ముఖ్య నేతలతో పార్టీ అధినేత కే చంద్రశేఖర్ రావు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఎర్రవెల్లిలో నివాసంలో జరిగిన సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న వివిధ సమస్యలను పార్టీ అధినేతకు బీఆర్ఎస్ నేతలు వివరించారు. గ్రామాల్లో కుంటుపడిందని, మెయింటెనెన్స్ లేక ట్రాక్టర్లు మూలనపడ్డాయని నేతలు చెప్పారు. సఫాయి కార్మికులకు జీతాలు ఇవ్వలేక పారిశుధ్యం పడకేసిందని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని పరిస్థితులపై కేసీఆర్‌కు నేతలు వివరించారు.

అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ ఎంతో సహనంతో, ఓర్పుతో తీసుకున్న నిర్ణయాలు, కార్యాచరణను నేతలకు వివరించారు. తెలంగాణ బాగోగులపై బీఆర్ఎస్‌కు ఉన్న ఆవేదన మరో పార్టీకి లేదని కేసీఆర్ తెలిపారు.ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ఉద్యమ స్ఫూర్తి బీఆర్ఎస్ సొంతమని, దశాబ్దాలుగా పోరాటం చేసిన నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన తెలంగాణ సమాజానికి స్వరాష్ట్ర చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపామన్నారు. తాము ఏం కోల్పోయామో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అర్థమైందని.. తెలంగాణ అంటే ఇతరులకు పొలిటికల్ గేమ్.. బీఆర్ఎస్‌కు మాత్రం ఒక టాస్క్ అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, బీఆర్ఎస్ హయాంలో మండు వేసవిలోనూ చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకాయని.. కాంగ్రెస్ పాలనలో జీవాలకు నీళ్లు దొరకని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నీళ్లందక ఎండిన వరి పంటలను పశువుల మేతకు వదిలేస్తున్న దయనీయ స్థితిపై కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ అసమర్థత మూలంగానే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని కేసీఆర్ వాపోయారు. పల్లె, పట్టణ ప్రగతితో దేశ రాష్ట్ర, గ్రామీణ ఆర్థిక ప్రగతికి పట్టుగొమ్మలుగా పరిఢవిల్లిన పల్లెలు.. నేడు కనీస ఆదరణ లేక కునారిల్లుతుండడంపై ఆవేదన చెందారు. ఇవాళ రాష్ట్రం ఎక్కడబోతే మాకేంది.. ప్రజలు ఏమైతే మాకేంది అన్న తీరున స్వార్థ రాజకీయ, అధికారమే పరమావధిగా కాంగ్రెస్ నాయకులు పని చేస్తున్నారన్నారు. ఇదే తెలంగాణ ప్రజల పాలిట శాపంగా మారిందని, కొత్త రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపినప్పుడు అన్నిరంగాల్లో అంధకార పరిస్థితులు.. ముఖ్యంగా విద్యుత్ రంగం పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని.. కరెంటు తక్కువైతే ఇతర రాష్ట్రాల గిడ్ తీసుకునే పరిస్థితి ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో పట్టుదలతో

మిగిలా 2వ పేజీలో



## బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళ్లు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

**మాజీ ఉప ప్రధానమంత్రి డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బషీర్‌బాగ్‌లోని వారి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారు, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఇతర ప్రజా ప్రతినిధులు ఉన్నారు.**

## నేడు రేపు భద్రాచలానికి సీఎం రేవంత్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం వెళ్లనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సతీ సమేతంగా భద్రాద్రి రాములవారిని దర్శించుకుంటారు. అయితే, ప్రభుత్వం తరపున సీఎంగా తొలిసారిగా రేవంత్ రెడ్డి సీతా రాములకు పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణ మహోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ప్రభుత్వం తరపున నిర్వహించే కొన్ని సంక్షేమ కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. ఆ తర్వాత భద్రాచలం నియోజక వర్గంలోని 'సన్న బియ్యం' లబ్ధిదారుడి ఇంట్లో సీఎం రేవంత్ భోజనం చేస్తారు.

## భవనంపై నుంచి దూకి ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య



**బలగం టీవి, హైదరాబాద్**

ఆరోగ్య సమస్యతో బాధపడుతూ మానసిక ఆందోళనకు గురైన ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్ గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జయలక్ష్మికి తన భర్త రమేష్‌తో 9 సంవత్సరాల క్రితం విడాకులయ్యాయి. కాగా ఆమె ప్రస్తుతం తన కూతురుతో కలిసి నివాసం ఉంటోంది. అయితే జయలక్ష్మి గత రెండు సంవత్సరాలుగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. తనకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్టు తెలిసినప్పటి నుంచి ఆమె తీవ్ర మానసిక ఆందోళనకు గురై నిరాశ చెందుతూ వస్తున్నది. ఈ క్రమంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కాగా ఆమె కవాడిగూడలోని సీజీఓ టవర్స్‌కు వచ్చింది. భవనం 8వ అంతస్తుకు వెళ్లి కిటికీ నుంచి కిందకు దూకడంతో తీవ్ర గాయాలతో రక్తస్రావమై అక్కడి కక్కడే మతి చెందింది. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కూతు రు అందించిన సమాచారంతో అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసు లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. తదుపరి వివరాలపై దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం జయలక్ష్మి కూతురు భావన బేగంపేట్‌లో సీఏ ఇంటర్న్ షిప్ చేస్తోంది.

# పెట్టుబడులను ప్రోత్సహిస్తాం

- పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటాం
- డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం ఒక రకంగా మనకు మేలే
- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుంది
- మంత్రి శ్రీధర్ బాబు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని, తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించి, పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తామని పారిశ్రామికవేత్తలను అన్నారు. గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం (జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో పార్క్ హయత్‌లో నిర్వహించిన "ఇండియా–లాటిన్ అమెరికా, కరేబియన్ కంట్రీస్ బిజినెస్ కాంక్లేవ్" రెండో ఎడిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ దేశాల ఉత్పత్తులపై ట్రంప్ విధిస్తున్న సుంకాలు ఒక రకంగా మనకు మేలే చేస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చూసుకుంటే పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు భారత్ వైపే చూస్తున్నారని పేర్కొన్నారు. దీన్ని అనుకూలంగా మార్చుకుని ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల అధికార ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. అలాగే పరిశ్రమల కోసం రాష్ట్రంలో ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం నుంచి పారిశ్రామివేత్తలకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. తెలంగాణ ఎంఎస్ఎంఈలు ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటేలా ప్రత్యేక పాలసీని తీసుకువచ్చామన్నారు.

జహీరాబాద్ నిమ్జ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆరు అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఇందులో మూడు కొరియా కంపెనీలు ఉన్నట్లు వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించి, పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్నారు. రాష్ట్రంలో ద్వితియ, తృతీయ శ్రేణి నగరాలతో పాటు, పట్టణాల్లోను పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. అలాగే ఆగ్రో ప్రాసెసింగ్ రంగాన్ని పోత్సహిస్తామని.. అన్నదాతలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

# నేడు శ్రీరామ నవమి శోభ యాత్ర..



- కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- సిబ్బందితో సీపీ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం హైదరాబాద్ నగరంలో శ్రీరామ నవమి శోభ యాత్ర జరగనుంది. దాంతో నగరం అంతటా హైదరాబాద్ పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ మేరకు భద్రత, బందోబస్తుపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఉత్సవ సమితి, ఇతర శాఖల అధికారులతో శోభాయాత్ర విషయమై చర్చలు జరిపినట్లు వెల్లడించారు. చిన్న ఊరేగింపులు అనుసంధానం అయ్యే కూడళ్ల వద్ద

మిగిలా 2వ పేజీలో

# లొంగిపోయిన 86 మంది మావోయిస్టులు



**బలగం టీవీ, భద్రాద్రి కొత్తగూడెం**

భద్రాద్రి, ములుగు జిల్లాలలో భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 86 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములుగు జిల్లా పోలీసుల సమక్షంలో సరెండర్ అయ్యారు. వీరిలో 66 మంది పురుషులు, 20 మంది మహిళా మావోయిస్టులు కలిపి మొత్తం 86 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఒక్కొక్కరికి తక్షణ సహాయం కింద 25 వేల రూపాయలను అందించారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా 86 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని.. కొత్తగూడెం పోలీసు అధికారులు వారితో ఫ్రెండ్లీగా మాట్లాడి వారిని ఒప్పించారని, నమ్మకం ఏర్పడ్డాకే వీరంతా లొంగిపోయారని తెలిపారు. ప్రభుత్వం తరపున సహాయం కూడా అందించినట్లు ఐజీ చంద్రశేఖర్ తెలిపారు.

ఇంత భారీగా మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోవడం మావోలకు గట్టి ఎదురుదెబ్బ అనే చెప్పవచ్చు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూతకు ఆకర్షితులై జనజీవన స్రవంతిలో కలవాలని లొంగిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఛత్తీగఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీలకు కోలుకోలేని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. వచ్చే మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టు పార్టీలను పూర్తిగా కూకటి వేళ్లతో సహా పెకిలించి వేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించినట్లుగా మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లలో భారీగా మావోయిస్టుల మృత్యువాత పడ్డారు. ఈ ఎన్‌కౌంటర్ల దెబ్బకు అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. వీరంతా కీలకమైన ప్రాంతాల్లో పనిచేసిన వారే అని పోలీసులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున మావోల లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలకు గట్టి దెబ్బే అని చెప్పుకోవచ్చు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మొత్తం వార్ జోన్ నడుస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లతో అగ్రనేతలను కోల్పోతున్నారు మావోలు. కేంద్ర కమిటీల్లో ఉన్న వారంతా వయోభారంతో ఉన్న పరిస్థితి. ఇలాంటి సందర్భంగా కేంద్ర బలగాలతో పోరాడే శక్తి లేక, తమ విలువైన జీవితాలను కుటుంబాలతో కలపాలని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూతలో భాగంగా పోలీసుల ఎదుట మావోయిస్టులు లొంగిపోయారు.


# బెస్ట్ ఎమ్మెల్యేగా హరీశ్‌రావు

- కేసీఆర్‌కు రెండో స్థానం
- మహిళల్లో సబితా ఇంద్రారెడ్డి
- పీపుల్స్‌పల్స్, సౌత్‌ఫస్ట్ సర్వే
- 118 నియోజకవర్గాల్లో సర్వే
- సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం సర్వేలో మినహాయింపు



మిగిలా 2వ పేజీలో

# సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ




**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..**

**బలగం టీవీ, వేములవాడ**

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏఐసీసీ, పిసిసి ఇచ్చిన పిలుపులో భాగంగా వేములవాడ లో దేశవ్యాప్తంగా జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ మన దేశానికి స్వతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీ, రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఈ పాదయాత్ర కొనసాగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాలకు సంబంధించిన కుల గణనను పూర్తిచేసి దేశంలో ఒక రోల్ మోడల్ గా నిలిచిందని అన్నారు.ఎస్సి వర్గీకరణ, బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించి బిల్లు ఆమోదింప చేయడం జరిగిందని అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ముందుకు పోతుందని అన్నారు.

# బెస్ట్ ఎమ్మెల్యేగా హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఎమ్మెల్యేల పనితీరుపై పీపుల్స్ పల్స్-సౌత్ ఫస్ట్ వెబ్ సైట్ సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. మొత్తం 118 మంది ఎమ్మెల్యేల్లో టాప్ టెన్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే సగం మంది ఉండటం విశేషం. అందులోనా టాప్ -1లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నిలిచారు. అదేసమయంలో అదేపార్టీకి చెందిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చివరి స్థానంలో నిలిచారు. కొడంగల్ మినహా అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే నిర్వహించారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 450 నుంచి 500 శాంపిల్స్ కంప్యూరైజ్డ్ అసిస్టెడ్ టెలిఫోనిక్ ఇంటర్వ్యూస్ - ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గాన్ని ఈ సర్వేలో మినహాయించారు. మొత్తం 118 మంది ఎమ్మెల్యేల్లో 24 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగుందని, 36 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, 58 మంది ఎమ్మెల్యేల పనితీరు పర్వాలేదని వెల్లడైంది

ఈ సర్వేలో టాప్‌టెన్ ఒక్కసారి పరిశీలిస్తే ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు, ఒకరు ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే ఉన్నారు. టాప్ టెన్‌లో మొదటి స్థానం సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కాగా, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2వ స్థానంలో, మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి 3వ స్థానంలో, పదో స్థానంలో కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి ఉన్నారు. ఈ సర్వేలో పురుషులు, మహిళలకు సమాన ప్రాధాన్యతిచ్చారు. ఈ సర్వే కేవలం ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది అనే అంశంపైన మాత్రమే నిర్వహించారు. గెలుపు ఓటమి అంశాలు పరిగణనలోకి తీసుకోలేదు.

రాష్ట్రంలో ప్రస్తుతం ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరు బాగుందని, 20 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, 37 మంది ఎమ్మెల్యేల పనితీరు పర్వాలేదని సర్వేలో వెల్లడైంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలలో 12 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగుందని, 13 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, 13 మంది ఎమ్మెల్యే పనితీరు పర్వాలేదని సర్వేలో తేలింది. బీజేపీకి సంబంధించి ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరు బాగుందని, ఒక ఎమ్మెల్యే పనితీరు బాగోలేదని, నలుగురు ఎమ్మెల్యేల పనితీరు పర్వాలేదని, అలాగే ఎంఐఎం ఎమ్మెల్యేలలో ఇద్దరు ఎమ్మెల్యేల పనితీరు బాగుందని, ఇద్దరు ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరు పర్వాలేదని వెల్లడైంది. సీపీఐకి చెందిన ఒకే ఒక ఎమ్మెల్యే పనితీరు పర్వాలేదని సర్వేలో తేలింది.

టాప్ టెన్‌లో ఉన్నవారు వీరే!

1 : మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, సిద్ధిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్
2 : మాజీ సీఎం కేసీఆర్, ప్రతిపక్షనేత, గజ్వేల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్
3 : రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్ బాబు, మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్
4 : అక్బరుద్దీన్ ఓవైసీ, చాంద్రాయణ గుట్ట ఎమ్మెల్యే, ఎంఐఎం
5 : మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే, బీఆర్ఎస్
6 : పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే, బీఆర్ఎస్
7 : మాజీ మంత్రి కేటీఆర్, సిరిసిల్ల ఎమ్మెల్యే,
8 : పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ
9 : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హుజుర్‌నగర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్
10 : వెంకటరమణ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేపీ

మహిళా టాప్ ఎమ్మెల్యేలలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మొదటి స్థానంలో, అధికార కాంగ్రెస్ కు చెందిన మంత్రి, ములుగు ఎమ్మెల్యే సీతక్క రెండో స్థానంలో ఉన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో టాప్ 10లో మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు మొదటి స్థానంలో ఉండగా, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ 10వ స్థానంలో నిలిచారు. మంత్రి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డి 2వ స్థానంలో, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క 3వ స్థానంలో, మంత్రి, నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 4వ స్థానంలో, మంత్రి, ములుగు ఎమ్మెల్యే సీతక్క 5వ స్థానంలో, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణరావు 6వ స్థానంలో, మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ 7వ స్థానంలో, మంత్రి, ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు 8వ స్థానంలో, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి 9వ స్థానంలో ఉన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో టాప్ 10లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు మొదటి స్థానంలో ఉండగా, బీజేపీలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మొదటి స్థానంలో ఉన్నారు. ఇక ఎంఐఎంలో చంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మొదటి స్థానంలో, ఉన్నారు.

# ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే వ్యతిరేకత తప్పదు

**(మొదటి పేజీ తరువాయి)**

తొమ్మిదినెలల్లో నేషనల్ గ్రిడ్ నిర్మించుకొని.. రాష్ట్రాన్ని కరెంటు కష్టాల నుంచి గట్టెక్కించుకున్నామన్నారు. 24గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుబాటులోకి తెచుకున్నామని గుర్తు చేశారు. ఇదంతా తెలంగాణ ప్రజలపట్ల ఉద్యమ పార్టీకి ఉన్న ప్రేమాభిమానంతోనే సాధ్యమన్నారు.


7మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 20వేల మెగావాట్లకు పెంచుకున్నామని, దీనికి తోడు బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో అందుబాటులోకి 2400 మెగావాట్ల విద్యుత్ వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విద్యుత్‌ను ఎందుకు అందించలేకపోతుందో అర్థంకావడం లేదన్నారు. ఇది కేవలం అసమర్థతేనని తెలుస్తుందని.. తీసుకున్న ప్రతి నిర్ణయంతో ప్రజలతో చీత్కారాలకు గురవడమే కాకుండా ప్రజలకు మంచి చేయాలన్న సోయి ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు. రైతులపట్ల ప్రేమ, వ్యవసాయంపై అవగాహన ఉంటే పాలనా ప్రాధాన్యతలు అర్థమవుతాయన్నారు. యంత్రాంగంపై పట్టు సాధించి ప్రజా సంక్షేమంపై రాజీలేని పాలన అందించొచ్చన్నారు. సమావేశంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే విజయ్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఆంజనేయ గౌడ్, హనుమంతు నాయుడు, గట్టు యాదవ్ పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య, బానోత్ మదన్ లాల్, బానోత్ హరిప్రియ నాయక్, రేగ కాంతారావు, మెచ్చా నాగేశ్వర్ రావు, వనం వెంకటేశ్వర రావు, లింగాల కమల్ రాజ్ హాజరయ్యారు. ఉమ్మడి నల్గొండ నుంచి ఎమ్మెల్యే జీ జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్ర కుమార్, నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, బొల్లం మల్లయ్య యాదవ్, బడుగుల లింగయ్య యాదవ్, పార్టీ సీనియర్ నేత విజయసింహా రెడ్డితో పాటు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆశన్నగారి, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, పార్టీ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల వంశీధర్ రావు హాజరయ్యారు.



# గొప్ప సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్...

**బలగం టీవీ, సిరిసిల్ల**

దివంగత, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త అని బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. శనివారం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్లో బీ ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేశారని, వివక్షను, అణచివేతను జయించిన యోధుడు అని అన్నారు. సమాజం బాబు జగ్జీవన్‌రామ్‌ను ఇప్పటికీ గుర్తు పెట్టుకుందంటే ఆయన సేవలే కారణమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో వెలుగులు నింపడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. పరిపాలనా దక్షత, ప్రజల పట్ల ఎనలేని ప్రేమ, నిస్వార్థ సేవలతో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందారని, ఉప ప్రధానిగా విశేష సేవలు అందించారని తెలిపారు. సిరిసిల్ల బీ ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, బీఆర్ యస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బత్తుల వనజ నాయకులు అగ్గి రాములు, మాట్ల మదు,కుంబాల మల్లారెడ్డి, లింగంపెల్లి సత్యనారాయణ, రమణారావు తదితరులు పాల్గొన్నారు.



# జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

**బలగం టీవీ,వేములవాడ**

బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వేములవాడ పట్టణంలో లేకపోవడం చాలా బాధాకరమని, పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ప్రభుత్వం ఏర్పాటు చేసి నేటి యువతకు మహనీయుని స్ఫూర్తి అందించాలని బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ అన్నారు. వేములవాడ పట్టణంలో బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ కార్యాలయంలో దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త మరియు దేశ మాజీ ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్ రామ్ సేవలు నేటి సమాజానికి ఆదర్శం అన్నారు. దేశ స్వతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషిస్తూనే సామాజిక సమానత్వం కోసం ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించి సామాజిక సమానత్వం కోసం వారు చేసిన పోరాట స్ఫూర్తిని మరువలేమన్నారు. . అణగారిన వర్గాల నుండి దేశ ఉప ప్రధానిగా ఎదిగిన విధానం నేటితరం యువత ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన రాజన్నసిరిసిల్ల ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి లక్కే సాగర్, ఉపాధ్యక్షుడు సుంకరి శ్రీకాంత్, వేములవాడ మండల అధ్యక్షుడు నేదురి రాజు, జింక శ్రీకాంత్, ముద్రకోల గణేష్, నేదురి శ్రీకాంత్, అలువాల రాము, పొత్తూరి మనోహర్, లక్కే దినాకర్, మల్లారం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు శ్రీరామ నవమి శోభ యాత్ర..

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. మతపరమైన ప్రదేశాలు, సమస్యాత్మకమైన ప్రాంతాలలో అదనపు బలగాలు మోహరించాలని అన్నారు. పిక్ పాకెటింగ్, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా మఫ్టీలో సిబ్బందిని ఉంచాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, యాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని సీనియర్ అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ప్రధాన ఊరేగింపులో ట్రాఫిక్ నిర్వహణ, జనసమూహ నియంత్రణ చాలా కీలకం అని తెలిపారు. యాత్రలో మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉన్నందున, ప్రార్థనా స్థలాలు, సున్నితమైన ప్రాంతాలు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటానికి ప్రతి జోన్ లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని తెలిపారు. ఈ ఊరేగింపు సమయంలో శాంతిని కాపాడుకోవాలని, నగర ప్రజలు పోలీసు అధికారులకు సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యాత్రను సురక్షితంగా, శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించడమే లక్ష్యమని, ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని సి.వి. ఆనంద్ తెలిపారు.

# జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ,సిరిసిల్ల,**

బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకలను ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించగా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఎస్పీ మహేష్ బి గితె, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప తదితరులతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ జయంతి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు.

అంతకుముందు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎస్సీ అభివృద్ధి అధికారి రాజ మనోహర్ రావు, ఆయా శాఖల అధికారులు, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తహాసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**బలగం టీవీ, తంగళ్లపల్లి**

బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి సందర్భంగా మండలంలోని తాహాసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో జయంత్ కుమార్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్వతంత్ర సమరయోధుడు, గొప్ప సంఘసంస్కర్త బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు.పార్లమెంటులో వివిధ మంత్రి పదవులు నిర్వహించారని, భారతదేశ ఉప ప్రధానిగా కూడా అయ్యారని ఈ సందర్భంగా తెలిపారు. దేశానికి ఎనలేని సేవలు చేసి ప్రజల గుండెల్లో అభినందనలు పొందిన గొప్ప నాయకుడని ఆయన సేవలు మరువలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ




**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సన్న బియ్యం పథకాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఇరువాల మహేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీలర్ సావణపెల్లి రాజయ్య, పూదరి లచ్చమ్మ, సండేసారం కిష్టయ్య, నల్లాల బాలరాజు, మైదం సాయి కృష్ణ, బూర్గుల అనిల్, ఇటికాల హరీష్, మందపల్లి వెంకటేష్, బుర్ర సతీష్, కొండ శ్రీనివాస్, పెంతల నాగరాజు, బూర్గుల శ్రీనివాస్, బూర్గుల విగ్నేష్, పూజారి నాగరాజు, రాగటి వెంకటేష్, కత్తెరపాక శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేడే సిరిసిల్ల ప్రెస్ క్లబ్ ఎన్నికలు

- అధ్యక్ష పదవి రేసులో ముగ్గురు..
- చింతకింది శ్యామ్ వర్సెస్ ఆకుల జయంత్
- శీ రామ నవమి ఆదివారం రోజున(నేడు) ప్రెస్ క్లబ్ ఎన్నికలు
- మూడవ సారి అవకాశం ఇవ్వాలని జయంత్.. కొత్త వారికి అవకాశం ఇవ్వాలని శ్యామ్ కుమార్ ల ప్రచారం





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల ప్రెస్ క్లబ్ ఎన్నికల నగరా మోగింది. ఈ నెల 6న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు తడుక విశ్వనాథం, కరుణాల భద్రచలం, టీవీ నారయణ లు ప్రకటించారు. అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు చింతకింది శ్యామ్ కుమార్ (ఆంధ్రజ్యోతి), ఆకుల జయంత్(నవ తెలంగాణ) ,రాపల్లి భాస్కర్(స్వేచ్ఛ) విలేకరులు బరిలో ఉన్నారు. ఎవరికి వారు తమదైన శైలిలో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఆకుల జయంత్ ఇప్పటికే రెండు సార్లు సిరిసిల్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా కొనసాగారు. ఒకసారి ఎన్నికల్లో గెలిచి మరోసారి ఏడాది పొడగించుకొని రెండేళ్లు తన పదవి కాలాన్ని ముగించారు. ఆంధ్రజ్యోతి టౌన్ రిపోర్టర్‌గా పని చేస్తున్న సినియర్ రిపోర్టర్ చింతకింది శ్యామ్ కుమార్ గత మూడు ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రయత్నించినా సినియర్ల ఒత్తిడితో.. వెనక్కి తగ్గారు. తనకు అవకాశం ఇవ్వడం లేదని ఈసారి తప్పక బరిలో నిలబడాల్సి వచ్చింది. సిరిసిల్ల పట్టణంలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్యామ్ కుమార్‌కు మంచి పేరుంది. వివాదరహితుడు. తన పని తాను చేసుకుపోతాడు అనే మంచి పేరుంది. యువ రిపోర్టర్ రాపల్లి భాస్కర్ కూడా సోషల్ మీడియా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. తనను గెలిపిస్తే సేవ చేస్తానని, విలేకరుల సంక్షేమానికి కృషి చేస్తానని చెబుతున్నారు. కానీ ఇప్పటికే రెండు సార్లు అధ్యక్షుడిగా కొనసాగిన ఆకుల జయంతి ఈ సారి స్వచ్ఛంధంగా తప్పుకుంటే బాగుండు అని కొంత మంది రిపోర్టర్లు చర్చించడం కనిపించింది. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో కొత్తవారికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. కానీ ఆకుల జయంత్ రెండేళ్లలో చేయాల్సిన పనులు చేయలేకపోయానని, కొన్ని అనివార్య కారణాల వల్ల పనులు కాలేకపోయాయని పేర్కొంటున్నారు. ఈ సారి ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలు, ప్రెస్ క్లబ్ నిర్మాణం చేస్తానని హామీ ఇస్తున్నారు. ఇవే హామీలను శ్యామ్ కుమార్, రాపల్లి భాస్కర్ లు సైతం ఇస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులు సమావేశాలు ఏర్పాటు చేసిన మేజార్టీ సంఖ్యలో పాల్గొంటున్నారు. ఓటు మాత్రం ఎవరికి వేస్తారో అంతుచిక్కకుండ ఉంది. ప్రస్తుత సర్వే ప్రకారం అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న ఆకుల జయంత్ కుమార్ కు, చింతకింది శ్యామ్ కుమార్ మధ్య పోటీ ఉందని పలువురు పేర్కొంటున్నారు. రెండు సంవత్సరాల్లో ప్రెస్ క్లబ్ అభివృద్ధి చేయకపోవడం, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తాజా మాజీ అధ్యక్షులు ఆకుల జయంత్ కుమార్‌కు ప్రెస్ క్లబ్ సభ్యుల్లో వ్యతిరేఖత చోటు చేసుకుందని పలువురు అంటున్నారు. ఈ వ్యతిరేఖతను ఎలా పూడ్చుకుంటారో , ఎలా ఓట్లు సాధిస్తారో అనే అంశం చర్చనీయంశంగా మారింది. రాపల్లి భాస్కర్ కు సైతం ఓటు బ్యాంకు ఉండటంతో ఎవరి ఓట్లు చీల్చుతారో అని ఆసక్తికరమైన చర్చ కొనసాగుతుంది. రాపల్లి భాస్కర్ కు పడే ఓట్లు ఆకుల జయంత్ ఓటు బ్యాంకు పై ప్రభావ చూపే అవకాశాలు ఉన్నాయని చర్చ జరుగుతుంది. ఏది ఏమైన ప్రెండ్లీ వాతవంణంలో ఈ ఎన్నికలు జరగాలని, ఎవరు గెలిచిన సిరిసిల్ల ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం సభ్యుల సంక్షేమం కోసం పాటుపడాలని కోరుకుంటున్నారు.

**సిరిసిల్ల ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో వివిధ పదవుల బరిలో పోటీలో ఉన్నవారి వివరాలు**

అధ్యక్షులు స్థానానికి
1) ఆకుల జయంతి కుమార్
2) చింతకింది శ్యామ్
3) రా పెల్లి భాస్కర్

ఉపాధ్యాక్షులు స్థానానికి
1) బొడ్డు పర్షరాములు
2) జాన దయానంద్
3) కాసన్నగొట్టు రమణయ్య
4) ఎస్ డి కలీం

ప్రధాన కార్యదర్శి స్థానానికి
1) ఆడెపు మహేందర్
2) ఇస్మత్ మోయిన్
3) పరకాల ప్రవీణ్

సహాయ కార్యదర్శి స్థానానికి
1) కంకణాల శ్రీనివాస్
2) షేక్ అస్గర్ హుస్సేన్

కోశాధికారి స్థానానికి
1) వంకాయల శ్రీకాంత్
2) వడ్నాల వేణు

కార్యవర్గ సభ్యుల స్థానానికి
1) అహ్మద్ అన్సారి అలీ
2) బుస్స రామనాథం
3) చౌటపల్లి వెంకటేశం
4) దుమాల రాము
5) జంగిలి రాజు
6) ఎండి పాషా
7) ముంద్రాయి శ్రీనివాస్
8) పి వేణు కుమార్

**ఎన్నికల నియమావళి.. ఎన్నికల అధికారుల ఆదేశాలు**

1) బ్యాలెట్ పత్రాలపై పెన్నుతో రైటు గుర్తు వేసి ఓటు వేయాలి. పోలింగ్ సమయంలో ప్రెస్ క్లబ్ సమకూర్చిన పెన్నుతోనే రైటు గుర్తును వేయాలి. సొంత పెన్నులు, ఇతర పెన్నులు ఉపయోగిస్తే ఓటు చెల్లుబాటు కాదు.

2) ఓటు వేసేందుకు వచ్చేవారు ప్రెస్ క్లబ్ గుర్తింపు కార్డు, అక్రెడిటేషన్ కార్డు, ఆధార్ కార్డు,... ఇవి కాకుండా ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావచ్చు.

3) సెల్ ఫోన్లు, కెమెరాలు పోలింగ్ బూతులోకి అనుమతించబడవు.

4) వార్తల కోసం పోలింగ్ స్టేషన్లోని ఫోటోలు ఎన్నికల అధికారులు అందజేస్తారు.

5) ఓటర్లు పోలింగ్ స్టేషన్ కు 150 మీటర్ల దూరాన్ని పాటించాలి.

6) ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే ఓటు హక్కు, ప్రెస్ క్లబ్ సభ్యత్వం తొలగించబడును.

7) పోలింగ్ స్టేషన్ పక్కన గల టౌన్ క్లబ్ లోకి, అలాగే హెూటల్లోకి ఎవరు రాకూడదు.

8) పోలింగ్ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కాగలదు. నిర్ణీత సమయానికి ముందే ఓటింగ్ 100 శాతం పూర్తి అయిన పక్షంలో అభ్యర్థులు కోరితే ఓట్ల లెక్కింపు వెంటనే ప్రారంభించే అంశాన్ని ఎన్నికల అధికారులు పరిశీలన చేస్తారు.

9) అధ్యక్ష స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు తమ ఏజెంట్ ను పోలింగ్ బూత్ లోకి అనుమతిస్తారు. అయితే ఏజెంట్లు ఉదయం 7.30 గంటలకల్లా పోలింగ్ హాలులోకి హాజరు కావాలి. అలాగే పోలింగ్ పూర్తి అయ్యేవరకు పోలింగ్ బూత్ లోనే ఏజెంట్లు ఉండాలి, మధ్య లో బయటకి వెళ్లడానికి అనుమతించబడదు.

# రాజన్న గోశాల,అన్నదాన ట్రస్ట్ కు విరాళం..

**బలగం టీవీ, వేములవాడ:**

హైదరాబాద్ కి చెందిన మదికంటి సృజన్ స్వాతి దంపతులు శనివారం రాజన్నను స్వామి వారిని దర్శించుకొని స్వామి వారి గోశాలకు రూ.ఒక లక్ష రూపాయలు, అన్నదానం ట్రస్టునకు 1లక్ష 50 వేలు, స్వామివారికి 63 వేల 638 రూపాయలు మొత్తం 3 లక్షల,13 వేల ,638 రూపాయల చెక్కును ఈఓ కె.వినోద్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అకౌంట్స్ అధికారి ఆగం రావు ఉన్నారు





# ఢిల్లీ క్యాపిటల్స్‌కు హాట్రిక్ విక్టరీ

## చెన్నై సూపర్ కింగ్స్‌కు మూడో ఓటమి
## 25 పరుగుల తేడాతో సీఎస్‌కేపై డీసీ గెలుపు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు హాట్రిక్ విక్టరీ నమోదు చేసింది. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ లో ముచ్చటగా మూడో ఓటమి చవిచూసింది. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో సీఎస్ కే పరాజయం పాలైంది. ఈ మ్యాచ్ లో 25 పరుగుల తేడాతో ఢిల్లీ విజయం సాధించింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 183 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(51 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సలతో 77) హాఫ్ సెంచరీతో రాణించగా.. అభిషేక్ పోరెల్(20 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 33), ట్రిస్టన్ స్టబ్స్(11 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 22 నాటౌట్) దూకుడుగా ఆడారు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్(2/25) రెండు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా, నూర్ అహ్మద్, మతీష పతీరణ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులే చేసి ఓటమిపాలైంది. విజయ్ శంకర్(54 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 69 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించగా.. ధోనీ(26 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. అయితే పెరిగిపోతున్న రన్ రేట్ ను అందుకోవడంలో విజయ్ శంకర్, ధోనీ విఫలమయ్యారు. వీరిద్దరూ క్రీజులోనే ఉన్నప్పటికీ... భారీ షాట్లు కొట్టలేక చెన్నై అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేశారు. ఇక ఓపెనర్లు రచిన్ రవీంద్ర 3, డెవాన్ కాన్వే 13, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 5 పరుగులు చేసి అవుటయ్యారు. శివమ్ దూబే (18), రవీంద్ర జడేజా (2) స్థాయికి తగ్గట్టు ఆడలేకపోయారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో విప్రాజ్ నిగమ్ 2, మిచెల్ స్టార్క్ 1, మహేశ్ కుమార్ 1, కుల్దీప్ యాదవ్ 1 వికెట్ తీశారు.

# పంజాబ్‌కు తొలి ఓటమి

## 50 పరుగుల తేడాతో రాజస్థాన్ ఘన విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025లో భాగంగా 18వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ పంజాబ్ కింగ్స్‌ను 50 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో రాజస్థాన్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో విజయం సాధించగా, పంజాబ్ ఈ సీజన్‌లో తొలిసారి ఓడిపోయింది.

శనివారం ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 205 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్(45 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సలతో 67) హాఫ్ సెంచరీతో రాణించగా.. రియాన్ పరాగ్(25 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలతో 43 నాటౌట్), కెప్టెన్ సంజూ శాంసన్(26 బంతుల్లో 6 ఫోర్లతో 38) కీలక ఇన్నింగ్స్ ఆడారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్(2/37) రెండు వికెట్లు తీయగా.. అర్షదీప్ సింగ్, మార్కో జాన్సెన్ తలో వికెట్ పడగొట్టారు.



అనంతరం పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులే చేసి ఓటమిపాలైంది. నెహాల్ వధేరా(41 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 62), గ్లేన్ మ్యాక్స్‌వెల్(21 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. పంజాబ్ కింగ్స్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. జోఫ్రా ఆర్చర్ నిప్పులు చెరగడంతో పియాన్ష్ ఆర్య(0), శ్రేయస్ అయ్యర్(10) తొలి ఓవర్‌లోనే పెవిలియన్ చేరారు. కార్తీకేయ, సందీప్ శర్మ ధాటికి పవర్ ప్లేలోనే పంజాబ్ 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో గ్లేన్ మ్యాక్స్‌వెల్, నెహాల్ వధేరా కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే ఇద్దరూ వరుస బంతుల్లో అవుట్ కావడం.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరడంతో రాజస్థాన్ రాయల్స్ విజయం లాంఛనమైంది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(3/25) మూడు వికెట్లు తీయగా.. సందీప్ శర్మ, మహీష్ తీక్షణ రెండేసి వికెట్లు పడగొట్టారు. కుమార్ కార్తీకేయ, వానిందు హసరంగాలకు చెరో వికెట్ దక్కింది.

# షూటింగ్ ప్రపంచకప్‌లో మెరిసిన భారత షూటర్లు

- **సిఫ్ట్‌కౌర్ సమ్రాకు స్వర్ణం, ఇషాసింగ్ రజత పతకం**

**బలగం టీవీ, హైదరాబాద్**





బ్యూనస్ ఎయిర్స్(అర్జెంటీనా) వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో శనివారం జరిగిన వేర్వేరు విభాగాల్లో సిఫ్ట్‌కౌర్ సమ్రాకు స్వర్ణం, ఇషాసింగ్ రజత పతకంతో మెరిశారు. మహిళల 25మీటర్ల పిస్టల్ ఫైనల్లో తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్ 35 స్కోరుతో రెండో స్థానంలో నిలువగా, సున్ యుజి(38, చైనా), ఫెంగ్ జియూన్(30, చైనా)వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. హెూరాహెూరీగా సాగిన ఫైనల్లో ఒలింపియన్ కాంస్య విజేత మను భాకర్‌ను ఇషాసింగ్ ఓడించి ముందంజ వేసింది. మరోవైపు మహిళల 50మీటర్ల రైఫిల్-3 పొజిషన్ ఫైనల్లో సిఫ్ట్‌కౌర్ 458.6 పాయింట్లతో స్వర్ణం ఖాతాలో వేసుకోగా, అనీటా మాంగోల్డ్(455.3), అరీనా అలుఖోవా(445.9) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

# స్టేడియంకు వచ్చిన ధోని తల్లిదండ్రులు.

**బలగం టీవీ, హైదరాబాద్**



చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ క్రికెటర్ ఎంఎస్ ధోని తల్లిదండ్రులు మ్యాచ్ చూసేందుకు మొదటి సారి స్టేడియంకి వచ్చారు. శనివారం చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ లో అరుదైన దృశ్యం కనిపించింది. ఎప్పుడూ పెద్దగా బయట కనిపించని ఎంఎస్ ధోనీ తల్లిదండ్రులు ఫస్ట్ టైమ్ స్టేడియానికి వచ్చి మ్యాచ్ చూశారు. వారితో పాటు ధోనీ సతీమణి సాక్షి, కుమార్తె జీవా కూడా వచ్చారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ మ్యాచ్ లో ధోనీ పేరెంట్స్ హైలైట్ గా నిలిచారు. అయితే ధోనీ పేరెంట్స్ సడెన్ గా స్టేడియంలో కనిపించడంతో ధోనీ రిటైర్‌మెంట్ గురించి మళ్లీ ఊహాగానాలు స్టార్ట్ అయ్యాయి. ఢిల్లీతో మ్యాచ్ ముగిశాక రిటైర్ మెంట్ పై ధోని ఏమైనా ప్రకటన చేస్తాడా? అని అటు ధోని అభిమానులు, ఇటు క్రికెట్ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే అలాంటిదేమీ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, రిటైర్ మెంట్ అంశంపై ఇటీవలే ధోని స్పందించాడు. చెన్నై సూపర్ కింగ్స్ తన ఫ్రాంచైజీ అని, సీఎస్ కే తరపున మరింత కాలం ఆడాలని అనుకుంటున్నట్లు తన మనసులో మాట చెప్పాడు. ఒక వేళ తాను వీల్‌చైర్‌లో ఉన్నా తనను లాక్కెళ్లిపోతారని సరదాగా చెప్పుకొచ్చాడు.

# ఎల్ 2 ఎంపురాన్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌కి ఐటీ నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

'ఎల్2 ఎంపురాన్' సినిమా దర్శకుడు నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌కి ఐటీ డిపార్ట్‌మెంట్ నుంచి నోటీసులు అందాయి. 2022లో పృథ్వీరాజ్ నటించిన మూడు చిత్రాలైన 'జన గణ మన', 'గోల్డ్', 'కడువ' సినిమాలకు సంబంధించి ఈ సినిమాలకు వచ్చిన ఆదాయంపై వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులు అందినట్లు తెలుస్తుంది. పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ బ్యానర్ కింద ఈ మూడు సినిమాలను నిర్మించగా.. ఈ మూడు చిత్రాలకు పృథ్వీరాజ్ సుకుమారన్ పారితోషికం తీసుకోలేదు. అయితే ఈ మూడు సినిమాల వలన రూ.40 కోట్లు లాభం వచ్చినట్లుగా పృథ్వీరాజ్‌పై ఆరోపణలు ఉన్నాయని.. వీటికి సంబంధించి వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులలో పేర్కొంది. ఈ నోటీసులకు సంబంధించి ఏప్రిల్ 29 వరకు పృథ్వీరాజ్ సమాధానమివ్వాలని ఐటీ శాఖ ఆదేశించినట్లు సమాచారం.ఐటీ శాఖ నోటీసులపై పృథ్వీరాజ్ తల్లి నటి మల్లిక సుకుమారన్ మాట్లాడుతూ.. తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని, విచారణకు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ విషయంలో ఆయన తగిన సమాధానం ఇస్తారని ఆమె తెలిపారు.




# 'కూలీ' విడుదల తేదీ ఖరారు

**బలగం టీవీ, హైదరాబాద్**

రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. అగ్ర నటులు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహీర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ విడుదల తేదీని ప్రకటించారు. ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 14న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు మేకర్స్. అయితే ఈ సినిమా హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న 'వార్ 2' సినిమాతో పోటీ పడనుంది. అయాన్ ముఖర్జీ డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమా కూడా 2025 ఆగస్టు 14న రిలీజ్ కానుంది. దీంతో ఇప్పుడు బాక్సాఫీసు వార్ తప్పేలా లేదు. కూలీ గ్యాంగ్‌స్టర్ బ్యాక డ్రాప్‌లో రాబోతుండగా.. వార్ 2 దేశభక్తి నేపథ్యంలో రాబోతుంది.





# తిరుమలలో నాగ్ అశ్విన్

**బలగం టీవీ, తిరుమల**

కల్కి సినిమాతో గతేడాది సూపర్ హిట్ అందుకున్న ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ తిరుమల శ్రీవారినిదర్శించుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులతో తిరుమలకి చేరుకున్న నాగ్ అశ్విన్ శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న అతడికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు నటిని శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

# 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ట్రైలర్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళ అగ్ర నటుడు అజిత్‌కుమార్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ సినిమాకు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ సినిమా విడుదల కానుంది. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.తిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకి జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. సిమ్రాన్, ప్రభు, అర్జున్ దాస్, సునీల్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.